
ఆంధ్రజ్యోతి ****
ANDHRAJYOTHY
నల్లగొండ
3
శనివారం 31 మే 2025



వైభవంగా ఊంజలి సేవోత్సవం



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా నిత్య పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా సాగాయి. 5



అర్హులకే సంక్షేమ పథకాలు

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకే అందాలని, ఎట్టి పరిస్థితుల్లో అనర్హులను ఎంపిక చేయవద్దని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి వ్యవసాయం, భూభారతి, ఇరిగేషన్, ఇందిరమ్మ ఇళ్లపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి తుమ్మల మాట్లాడారు.
- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట (కలెక్టరేట్)

అందరి సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాను సర్వతోముఖాభివృద్ధి చేయాలన్నారు. నల్లగొండ జిల్లా వ్యవసాయం, రాజకీయాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే గ్రావిటీ ద్వారా నీటిని తీసుకోవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అధికారులు వెంటనే కలెక్టర్లకు తెలపాలన్నారు.రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఏఈవోల కొరత ఉందన్నారు. నల్లగొండ జిల్లాకు అదనంగా ఏఈవోలు కావాలని మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు ఏఈవోలను నియమించుకునే అధికారం కలెక్టర్లకు ఇచ్చామని, వెంటనే అవసరమైనంత మంది ఏఈవోలను నియమించుకుని అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో వరి పంట సాగును తగ్గించి ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోందన్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల మధ్యలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్నారు.

కి రేషన్‌కార్డు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న ఐదేళ్లలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. డెన్మార్క్ నుంచి ప్రపంచంలోనే అత్యంత అత్యాధునిక టెక్నాలజీ తీసుకువచ్చి హెలీకాప్టర్ ద్వారా సర్వే చేయించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పిలాయిపల్లి, బునాదిగానికాల్వ, ధర్మారెడ్డిపల్లి ప్రాజెక్టుల కోసం రూ.500 కోట్లు, డిండి ప్రాజెక్టు కోసం రూ.1,500 కోట్లు మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయసముద్రం ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. త్వరలోనే ఆ పనుల ను కూడా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. దేవాదుల ఫేస్-3 ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి నీళ్లు తీసుకువస్తామన్నారు. నాగార్జునసాగర్ ఎత్తిపోతల, నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి అన్ని ప్రాజెక్టులకు ఆయకట్టు ప్రణాళికలను సిద్ధం చేసి నీటి విడుదల విషయాలను ముందే ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడిక పేరుకుపోయిందని, త్వరలో అన్ని ప్రాజెక్టుల్లోని పూడిక తీత పనులు ప్రారంభించి ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో మొదలు పెట్టిన డబుల్

- మిగతా 5వ పేజీలో...

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు

పారదర్శక పాలన అందించాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో అవినీతికి ఆస్కారం ఇవ్వకుండా పేదలకు పారదర్శకమైన, అవినీతి రహిత పాలన అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో అధికారుల అలసత్వం, అవినీతి ఎక్కువగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వాటన్నంటినీ విడనాడాలని హెచ్చరించారు. రీజనల్ రింగ్ రోడ్డుకు రూ.22 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. యాసంగిలో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే 20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేశామన్నారు. రైతులు పండించిన సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లర్ల ద్వారా కస్టమ్ మిల్లింగ్ చేయించి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డులోని ప్రతీ ఒక్కరికి ఆరు కిలోల చొప్పులన ఉచితంగా అందిస్తున్నామన్నారు. గతంలో రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందుల కు గురి చేశారని, ప్రస్తుతం అడిగిన ప్రతీ ఒక్కరి

ఆరోగ్యానికి
'పొగ'బెడుతూ

ప్రాణాలకు ముప్పని తెలిసినా ధూమపానం చేస్తూనే ఉన్నారు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల యువతకు ధూమపాన వ్యసనం అధికమైందని తెలుస్తోంది. విద్యార్థులు సైతం ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. నేడు ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. 200 మందిని సర్వే చేయగా 95 మంది పొగ తాగుతున్నట్లు తెలిపారు. అందులో అత్యధికులు యువత, విద్యార్థులు ఉండటం గమనార్హం. దీనికి తోడు అనారోగ్యం పాలవుతామని కూడా వారికి తెలుసని సర్వేలో వెల్లడైంది. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని తెలుసని 150 మంది అంగీకరించారు. పక్కవారు పొగ తాగుతుంటే ఏం మాట్లాడకుండా వెళ్లిపోయేవారు 150 మంది ఉండటం గమనార్హం.

- వివరాలు 4వ పేజీలో

సాగుకు సన్నద్ధం

రోళ్లు పగిలే ఎండలు కాయాల్సిన రోహిణీ కార్తెకు ముందే అనూహ్యంగా తొలకరి వాన పలకరించడంతో రైతులు మురిసిపోయారు. నైరుతి పవనాలు ముందస్తుగానే ప్రవేశించడంతో ముందస్తు వానలు పడుతున్నాయి. వాతావరణం చల్లబడి ప్రతి రోజూ చిరుజల్లులు కురుస్తుండడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆరుతడి పంటల సాగుకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. రైతులు సంప్రదాయకంగా విశ్వసించే మృగశిర కార్తె సైతం జూన్ 8న ప్రవేశించనుండడం, ఇప్పటికే వానలు బలంగా కురుస్తుండడంతో ఈ వారం తర్వాత ఆరుతడి పంటలకు విత్తనాలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



- ఆరుతడి పంటల సాగుకు దుక్కులు సిద్ధం చేసిన రైతులు
- మృగశిరలో వాన పడగానే విత్తనాలు వేసేలా ప్లాన్
- విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచిన ప్రభుత్వం
- ఎలాంటి కొరత రానివ్వబోమని స్పష్టతనిస్తోన్న వ్యవసాయ శాఖ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని మెట్టప్రాంతాల్లో ప్రధానంగా పత్తి, కంది, జొన్న సాగుచేసే భూములను విత్తనాలు వేయడానికి అనుకూలంగా దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. మరోవైపున విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 7.94లక్షల ఎకరాల్లో పత్తి, 27వేల ఎకరాల్లో కంది, 37వేల ఎకరాల్లో జొన్న, పెసర, సజ్జ వంటి ఇతర ఆరుతడి పంటలు సాగు చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వానాకాలం సీజన్ ముందస్తుగానే మొదలవుతుండడంతో వ్యవసాయాధికారులు సైతం అప్రమత్తమయ్యారు. జిల్లాలో పత్తి సాగు నిమిత్తం ప్రభుత్వం ధ్రువీకరించిన 20 కంపెనీలకు చెందిన 19.75 లక్షల పత్తి విత్త న ప్యాకెట్లు (ఒక్కో ప్యాకెట్ 450 గ్రాములు) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా 2,254 క్వింటాళ్ల కంది విత్తనాలు, మరో 3వేల క్వింటాళ్ల ఇతర విత్తనాలు అందుబాటు లో ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేదని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. పత్తి సాగుచేసే రైతులు సైతం ఇప్పటికే స్థానిక డీలర్ల వద్ద, ఏపీలోని గుంటూరు, మాచర్ల ప్రాంతాల్లోని డీలర్ల నుంచి అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, గద్వాల ప్రాంతాలలోని డీలర్ల నుంచి విత్తనాలు కొనితెచ్చుకొని సిద్ధంగా పెట్టుకున్నారు. జూన్ నెలకు సంబంధించి అవసరమైన 57,569 మెట్రిక్‌టన్నుల యూరియా, 52,860 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 14,317 మెట్రిక్‌టన్నుల ఇతర ఎరువులు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు. వచ్చే ఆరునెలలకు అవసరమైన ఎరువులు బఫర్ స్టాక్‌లో ఉన్నాయని రైతులెవరూ ఎరువుల కోసం ఇబ్బందిపడాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు.

బోరు బావుల కింద నారుమళ్లు సిద్ధం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 12.35 లక్షల ఎకరాల వరి సాగవుతుందని అంచనావేశారు. ఇందులో నాగార్జునసాగర్, మూసీ, కాళేశ్వరం, ఎస్ఆర్ఎస్పీ రెండోదశ కింద దాదాపు 8లక్షల ఎకరాలు సాగయితే, మిగిలిన 4.35లక్షల ఎకరాలు బోరుబావుల కింద, చెరువుల కింద సాగవుతుంది. ప్రాజెక్టుల కింద ఆగస్టు వరకు సాగుకు సమయం ఉండగా, బోరుబావులకింద సాగు చేసే రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో వరిసాగుకు 2.70లక్షల క్వింటాళ్ల వరివిత్తనాలు అవసరమవుతాయని, ప్రస్తుతం 66వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు కొరత లేకుండా వరివిత్తనాలందించేందుకు ఏర్పాట్లు చేశామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన 'దర్బార్' కార్యక్రమంలో ఆయన సాయుధ సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల పాత్ర కీలకమని అన్నారు. సిబ్బంది విధులను చక్కగా నిర్వహించడంతో పాటు ఆరోగ్యం, కుటుంబ సభ్యుల సంక్షేమంపై దృష్టిసారించాలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అందుకోసం ప్రతీ ఒక్కరు వ్యాయామం, క్రీడలు, యోగ అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలన్నారు. ఈజీ మనీ అంటూ ఆన్‌లైన్ యాప్‌లలో ఇన్వెస్ట్ చేసి మోసపోవద్దని సూచించారు. ఆర్థికపరంగా ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందరికీ సమానంగా డ్యూటీలు వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ వెంట ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో శ్రీనివాసులు, ఆర్‌ఐలు సంతోష్, సూరప్పనాయుడు, శ్రీనివాస్, హరిబాబు, తదితరులు ఉన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించాలి

బక్రీద్ పర్వదినాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మత పెద్దలతో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండుగలను నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో పీస్ కమిటీ సభ్యులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని మతాల వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇతర జిల్లాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పోలీస్‌శాఖ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది సమన్వయంతో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. పశువులను రవాణాచేసే ప్రతీ వాహనానికి తగు నిర్ధారిత ప్రామాణిక పత్రాలు పరిశీలించి అనుమతిస్తారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను అక్రమంగా రవాణాచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇతరులు ఎవ్వరూ వాహనాలను ఆపరాదని, అలాచేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, ఎస్ఐలు గోపాల్‌రావు, శంకర్, జయకర్, వివిధ కులాల మత పెద్దలు హఫీస్‌ఖాన్, గోలి మధుసూదన్‌రెడ్డి, హశం, అహ్మద్ కలీం, బండారు ప్రసాద్, క్రిస్టోఫర్, శౌరయ్య, ఎలిజల నరసింహ, కౌన్సిలర్లు సమద్, బషీర్, అమీర్, అభిమన్యు శ్రీను, బాబా, ఇబ్రహీం, పాల్గొన్నారు.

శాలిగౌరారం
ప్రాజెక్టుకు జలకళ

- 17 అడుగులకు చేరిన ప్రాజెక్టు నీటి మట్టం
- నాలుగు రోజుల్లో పూర్తిగా నిండే అవకాశం 5

డిగ్రీ పరీక్షల్లో 32మంది డీబార్
5

సులభంగా సంపాదించాలనే
నకిలీ ఆయిల్ తయారీ

- ఒకసారి జైలుకెళ్లి వచ్చినా తీరు మారని నిందితుడు 4
- పట్టుకున్న సూర్యాపేట పోలీసులు

పాడి సహకార సంఘాల అనుసంధానం మంచి పరిణామం

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పాడి సహకార సంఘాలను అనుసంధానం చేయడం మంచి పరిణామమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డీసీసీబీ బ్యాంకులో డీసీవోలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025-26 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంఘంగా ప్రకటించిన సందర్భంగా జాతీయ స్థాయిలో సహకార సంస్థలను అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో సహకార సంస్థలు బలోపేతం అవుతాయన్నారు. అదేవిధంగా ప్రాథమిక పాడి సహకార సంఘాలు డీసీసీబీ బ్యాంకులో సేవింగ్ ఖాతాలు తెరవాలని కోరారు. ఈ ఖాతాలకు మైక్రో ఏటీఎం, రూపే కిసాన్ కార్డులతో పాటు అన్ని డిజిటల్ లావాదేవీల సదుపాయాలను కల్పిస్తామన్నారు. డీసీసీబీ నుంచి పీఎంఈజీపీ కింద డెయిరీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. త్వరలోనే కొత్త జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటు చేసి వారికి నాబార్డు సహాయంతో రుణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీవో పత్యనాయక్, సీఈవో శంకర్‌రావు, జీఎం నర్మద, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 2న జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్న
మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు

నల్లగొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలో నిర్వహించనున్న వేడుకలలో జాతీయజెండాలను మండలి చైర్మన్ గుత్తా,మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శుక్రవారం ఉత్వర్వులు జారీ చేశారు. నల్లగొండలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సూర్యాపేట జిల్లాలో నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, యాదాద్రి జిల్లాలో శాసనమండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి, వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వామపక్షాల పోరాటాల ఫలితంగా 2005లో వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం బడ్జెట్లో కేవలం రూ.73వేల కోట్లు నామమాత్రం కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఉపాధి చట్టంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని, కార్మికులకు పని దొరికి వలసలు నిలిచాయన్నారు. కానీ మోదీ కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ చట్టం లేకుండా కుట్ర చేస్తున్నారని, దాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు.

వ్యవసాయరంగంలోకి యంత్రాలు రావడంతో కూలీలకు పనిదొరకని దుస్థితి ఏర్పడిందన్నారు. సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించి జాబ్ కార్డ్ లేని పేదలందరికీ నూతన కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భార్యాభర్తలకు పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, టెంటు, మెడికల్ కిట్టు లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. నాలుగు కిలోమీటర్ల దూరం దాటితే లోకల్ ఆటో చార్జీలు చెల్లించాలని చట్టంలో ఉందని గుర్తుచేశారు. చట్టం వచ్చిన నాటి నుంచి పనిచేస్తున్న ఉపాధి సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, వేతనాలను నెలనెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యంతో పాటు పనిచేయని రోజులకు పరిహారం చెల్లిస్తూ, మరణిస్తే రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు, నాయకులు దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, చింతపల్లి మారయ్య, గండమల్ల రాములు, పెంటమల్ల సుకన్య, మన్నె భిక్షం, కట్ట అంజయ్య, రుద్రాక్షి యాదయ్య, వంగూరి వెంకన్న, మల్లయ్య, లింగయ్య, బూరుగు లక్ష్మీ, ఓకుంట్ల నరసమ్మ, అశోక్, ఐతరాజు లక్ష్మయ్య, రాజు, జ్యోతి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి 'పొగ'బెడుతూ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధూమపానం తాగే ప్రియులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. వయసుతో సంబంధం లేకుండా తెగ కాల్చేస్తున్నారు. కొంతమందికి ఇది ఫ్యాషన్‌గా మారింది. నిద్రలేచిన సమయం నుంచి రాత్రి పడుకునే వరకూ ధూమపానాన్ని అలవాటుగా పెట్టుకున్నారు. ప్రమాదం పొంచి ఉందని తెలిసినా వయోభేదం లేకుండా పొగాకు ఉత్పత్తులను పీల్చుతూ అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి సర్వే చేసిన సర్వేలో ధూమపానం చేస్తున్న వారిలో 50 శాతం మంది యువకులు ఉన్నట్లు తేలింది. బహిరంగ ప్రదేశాల్లో తాగడం తప్పని 75 శాతం మంది తెలిసి తాగుతున్నట్లు తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)



గతంలో గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది బీడీలు తాగేవారు. కానీ మారుతున్న సమాజంలో వయస్సుతో నిమిత్తం లేకుండా యువతకు ధూమపానం చేయడం ఫ్యాషన్‌గా అలవాటైపోయింది. అయితే కొందరి సరదా మరికొందరికి ఇబ్బందిగా మారింది. ధూమపానంతో ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినప్పటికి మానడం లేదు. వారి జీవితాలు పొగబారే వరకు పొగతాగడం మానడం లేదు. కొంతమందికి అలవాటు లేకున్నా వారి స్నేహితుల ప్రోద్బలంతో అలవాటుచేసుకుంటున్నారు. ఎక్కువగా సిగరెట్లు, బీడీలు కాల్చుతున్నారు.

ప్రాణాల ముప్పు

పొగాకు ఉత్పత్తులను తీసుకోవడం వలన ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఆ విషయం తెలిసినప్పటికీ ధూమపానాన్ని మానడం లేదు. ధూమపానం చేయడం వ్యసనంగా పెట్టుకున్నారు. పొగాకులో నికోటిన్ అనే విషపదార్థం ఉంటుంది. ఇది కొవ్వులో కరిగి రక్తప్రసరణపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నికోటిన్ పదార్థానికి మనసును త్వరగా ప్రభావం చేసే శక్తి ఉంటుంది. కొంతమంది మనసు ఇబ్బందిగా ఉన్నప్పుడు ధూమపానం చేస్తుంటారు. ఈ సమయంలో వారికి కొంత ఉపశమనం కలుగుతుంది. పీల్చిన సిగరెట్ నుంచి 25శాతం నికోటిన్ రక్తంలో కలుస్తుంది. అది ఏడు సెకన్లలో మెదడుకు చేరి ఉత్సాహాన్ని ఇస్తుంది. పొగతాగడం వలన గుండెపోటు, క్యాన్సర్, నోటి, గొంతు, స్వరపేటిక, మూత్రపిండాలు, మధుమేహం లాంటి 20 రకాల వ్యాధులు వస్తాయి. నికోటిన్ రక్తంలో కలవడం వల్ల గుండెపోటుతో పాటు పక్షవాతం వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. క్యాన్సర్‌తో జిల్లా అనేక మంది చనిపోతున్నారు. కేవలం పొగాకు మూలంగా జిల్లాలో 80 నుంచి 110 వరకు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.

తాగని వారికి కూడా ఇబ్బందులు

పొగాకు ఉత్పత్తులను తాగేవారితో పాటు వారి పక్కన ఉన్న వారికి కూడా ఇబ్బందులు కలగనున్నాయి. పొగ తాగకున్నా తాగే వారి పక్కన ఉండి వారు వదిలే పొగను పీలిస్తే అనారోగ్య సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పొగతాగే వారి నివాసాల్లో ఉన్న పిల్లలు ఎక్కువగా వివిధ వ్యాధులకు గురవుతుంటారని పేర్కొంటున్నారు. పెద్దలు పొగ తాగుతుండడంతో వారి పిల్లలకు పొగచేరి వారు ఉబ్బసం, అలర్జీ వ్యాధులకు గురవుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానంపై నిషేధం ఉంది. సినిమా థియేటర్లు, పార్కులు, ఆసుపత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బస్సులు, హోటళ్లు, కళాశాలలు, పాఠశాలలు, విద్యాసంస్థలు, పబ్‌లు, రెస్టారెంట్‌లు, లైబ్రరీలు వంటి ప్రాంతాల్లో ధూమపానం నిషేధం అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

చట్టాలున్నా అమలేదీ

ధూమపానాన్ని నియంత్రించేందుకు చట్టాలున్నా అవి ఆశించిన మేర అమలుకు నోచుకోవడం లేదు. 2003లో పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. 2008లో బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నేరమని చట్టాన్ని రూపొందించింది. కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ కూడా జీవో నెం.133ను అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. దీని ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో పొగతాగితే రూ.200 నుంచి రూ.500 వరకు జరిమానా విధించే అవకాశాన్ని పోలీసులకు అప్పగించారు. పొగాకును నిషేధించేందుకు చట్టాలు ఉన్నా అవి క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో అనేక మంది వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కమిటీ ఏర్పాటు చేశారు. దీంట్లో సంయుక్త పాలన అధికారి అధ్యక్షుడిగా జిల్లా వైద్యాధికారి కన్వీనర్‌గా, అగ్నిమాపక అధికారి, పోలీస్, రవాణా, పురపాలక సంఘం, విద్యా, రెవెన్యూ, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో కమిటీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

- ధూమపాన ప్రియుల్లో 50 శాతం యువత
- బహిరంగంగా తాగడం తప్పని తెలిసిన వారు 75 శాతం



ప్రశ్న : పొగతాగడం అలవాటు ఉందా?
తాగుతాం : 95 లేదు : 105
(తాగేవారిలో ఎక్కువగా విద్యార్థులు, యువత ఉన్నారు)
ప్రశ్న : బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని తెలుసా?
తెలుసు: 155 మందికి,తెలియదు:45 మంది
ప్రశ్న : మీ పక్కన ఎవరైనా పొగతాగుతుంటే ఏం చేస్తారు?
తాగవద్దని చెబుతాం : 55 మంది, అక్కడి నుంచి వెళ్లిపోతాం:145 మంది
(ప్రతీ అంశంపై 200 మంది చెప్పిన సర్వే)

పొగాకు ఉత్పత్తులతో ప్రాణాలకు ముప్పు



పొగాకు ఉత్పత్తులతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. తెలిసీ, తెలియని వ యసులో మొదలైన వ్యస నం జీవితాన్ని విషాదంలోకి తీసుకెళ్తుంది. ఈ వ్యసనాన్ని మా నుకోక పోతే జీవితం అంధకారం కావడం ఖాయం. పొగతాగడం వల్ల ఇంట్లోని చిన్నారులు వ్యా ధులకు గురవుతారు. నికోటిన్ పదార్థం రక్తంలో కలిసి గుండెపోటు, పక్షవాతం వస్తుంది. ప్రభుత్వాలు పొగాకు నివారణకు చర్యలు తీసుకోవాలి.

- రామూర్తి యాదవ్, ప్రముఖ డాక్టర్

రూ.లక్షల్లో విక్రయాలు

సూర్యాపేట జిల్లా పరిధిలో నిత్యం లక్షల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయాలు జరగుతున్నాయి. అందులో ఎక్కువగా సిగరెట్ల విక్రయాలు ఉంటున్నాయి. పొగాకు ఉత్పత్తులను ఎక్కువగా మధ్య వయస్సు వారితో పాటు యువత తీసుకుంటున్నారు. జిల్లా జనాభా 20,75,000 ఉండగా అందులో పురుషులు 9,50,785మంది ఉన్నారు. ఇందులో సుమారు 3 లక్షలకు పైగా పొగాకు ఉత్పత్తులకు బానిసలయ్యారు. జిల్లాలో ప్రతి రోజూ వివిధ కంపెనీలకు సంబంధించిన సిగరెట్ విక్రయాలు సుమారు రూ.15లక్షల వరకు సాగుతున్నాయి. ఒక్క సూర్యాపేట జిల్లా కేంద్రంలో 40వేల మంది ప్రతిరోజూ సిగరెట్, బీడీలు తాగుతున్నారు. అంతేకాకుండ జిల్లా కేంద్రంలోని ఓ చిన్న పాన్‌షాపు దుకాణాదారుడు ప్రతి రోజూ 50 నుంచి 60 వరకు సిగరెట్ డబ్బాలు విక్రయిస్తున్నాడు.

అడ్డాలుగా టీస్టాల్స్

సిగరేట్‌లు ఎక్కువగా టీ స్టాల్స్‌లో విక్రయాలు జరుగుతున్నాయి. యువత ఎక్కువగా టీ, లెమన్‌టీతో పాటు సిగరేట్‌ను తాగుతున్నారు. జిల్లా కేంద్రంలో టీ స్టాల్స్‌లో సిగరేట్‌కు ప్రత్యేకంగా ఒక రూం ఏర్పాటును చేస్తున్నారు. దీంతో సిగరేట్ తాగాలంటే టీ స్టాల్‌కు వెళ్లాలనేలా మారింది. ప్రతి చోటా ఎప్పుడూ చూసినా 10 నుంచి 15 మంది సిగరేట్ తాగుతూ కనిపిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి మొదలుకొని రాత్రి వరకు తాగుతూనే ఉంటున్నారు. అదేవిధంగా కళాశాలల్లో చదివే విద్యార్థులు ధూమపానాన్ని బాగా అలవాటుగా మార్చుకున్నారు.



తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి


వెంకటేశం(ఫైల్)

వలిగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి కింద పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెల్వర్తి గ్రామంలో శుక్రవారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మగాని వెంటేశం(47) వృత్తిరీత్య గీతకార్మికుడు. వృత్తిలో భాగంగా శుక్రవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా, కుటుంబసభ్యులు భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు వెంకటేశం అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

రాత్రి అడ్డుకున్నా.. తెల్లారాక...

యాదగిరిగుట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన వ్యక్తి గురువారం సాయంత్రం ఇంట్లో ఆత్మహత్యకు యత్నిస్తుండగా భార్య అడ్డుకుంది. అయినా మరుసటి రోజు ఉదయం మరో చోట ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం యాదగిరిగుట్ట మునిసిపల్ పరిధిలోని యాదగిరిపల్లి(రెండో వార్డు)కు చెందిన పొన్నం రాము(39) తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతుండేవాడు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు ఇంట్లోని గదిలో ఉరి వేసుకుటుండగా భార్య గమనించి కేకలతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి విడిపించారు. శుక్రవారం సుమారు ఉదయం 6 గంటలకు భార్య నిద్రలేచి చూసేసరికి భర్త కనిపించలేదు. రోజు మాదిరిగా బయటకు వెళ్లొచ్చని భావించింది. అయితే నూతన అన్నదాన సత్ర భవనం వెనకాల గ్రిల్స్‌కు ఉరివేసుకున్నట్లు స్థానికులు గుర్తించారు. ఉదయం 9.40 గంటలకు భార్యకు సమాచారం అందిందని, భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భాస్కర్ తెలిపారు.


దొంగలను పట్టుకుంది మేమే : శేషగిరిరావు



యాదగిరికొండపై మాట్లాడుతున్న ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు

యాదగిరిగుట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట దేవస్థానంలో చింతపండు దొంగలను పట్టుకుంది తామేనని ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే శేషగిరిరావు అన్నారు. దేవస్థానం పరిధిలోని ఎస్పీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రసాదాల కౌంటర్ వైపు వస్తున్న కొందరిని ఎస్పీఎఫ్ సెంట్రీ అనుమానించారు. దీంతో వారు పారిపోతుండగా వైర్‌లెస్ సెట్ సమాచారం అందించామని చెప్పారు. అనంతరమే పోలీస్ వాహనం సైరన్ వినిపించిందని, దాంతో వారు పరారయ్యేందుకు యత్నించారని తెలిపారు. దుండగులను సెంట్రీ అదుపులోకి తీసుకొని విచారించగా ప్రసాదాల తయారీ కేంద్రంలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అని తెలిసిందన్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి దొంగతనానికి వినియోగించిన కారు మంగళవారం రాత్రి 8.29గంటలకు కొండపైకి వచ్చిందని తేలిందన్నారు. ఇదే విషయంలో ఆలయ అధికారులకు కూడా తాము తక్షణమే సమాచారం అందించామన్నారు. తదుపరి విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించగా ప్రస్తుతం దర్యాపు జరుగుతుందన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎఎస్‌ఐ అనిల్, ఏఎస్‌ఐ మాణిక్‌ప్రభు ఉన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్


నిందితుడు వరప్రసాద్

నూతనకల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి సీఐ నరసింహారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం వెంకేపల్లి గ్రామానికి చెందిన దాసరి మహేష్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన మాదాసు వరప్రసాద్ ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యాడు. ఏసీ మెకానిక్, వోల్వో బస్‌డ్రైవర్ అయిన వరప్రసాద్ మహేష్‌కు బస్ డ్రైవింగ్ నేర్పించి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మ బలికాడు. అతడి మాటలు నమ్మిన మహేష్ ఫోన్‌పే ద్వారా వరప్రసాద్‌కు రూ.4.30లక్షలు పంపించాడు. డబ్బులు తీసుకున్న తర్వాత చాలారోజులుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. అయినప్పటికీ ఉద్యోగం ఇప్పించేందుకు డబ్బులు ఇంకా డిమాండ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో వరప్రసాద్‌కు మహేష్ ఫోన్ చేసి నువ్వు డబ్బులు ఇస్తానను సూర్యాపేటకు రమ్మన్నాడు. దీంతో సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ సమీపానికి వరప్రసాద్ రాగా అప్పటికే అక్కడ మాటువేసిన పోలీసులు అరెస్ట్ చేసి తుంగతుర్తి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మంత్రుల పర్యటన నేపథ్యంలో పలువురి తరలింపు

సూర్యాపేట(కలెక్టరేట్), మే 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్షా సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిల పర్యటనను అడ్డుకోవాలని కొంత మంది నిర్ణయించుకున్నారు. సూర్యాపేట పట్టణంలోని మూడో విడత ఇందిరమ్మ కాలనీ, కేసారం వద్ద గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు కొంతమంది కలెక్టరేట్ వద్దకు వచ్చారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించినప్పటికీ అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదని, ఏళ్లు గడుస్తున్నా అద్దె ఇళ్లలో నివాసముంటున్నామని ఈ విషయాలను రాష్ట్ర మంత్రులకు తెలపాలని భావించి కలెక్టరేట్‌కు వచ్చారు. అదేవిధంగా ఇటీవల శిశు విక్రయాలకు సంబంధించిన నేరస్తుల నుంచి శిశువులను కొనుగోలు చేసి సుమారు మూడేళ్ల పాటు అల్లారుముద్దుగా పెంచుకున్న చిన్నారుల తల్లిదండ్రులు, వారి కుటుంబసభ్యులు కలెక్టరేట్ వద్దకు వచ్చారు. తాము పెంచుకున్న చిన్నారులను తమకు ఇప్పించాలని మంత్రులకు విన్నవించేందుకు రాగా వారిని పోలీసులు కలెక్టరేట్‌లోకి వెళ్లనీయకుండా గేట్ వద్దనే అడ్డుకుని చివ్వెంల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధిత ప్రజలను కలెక్టరేట్‌లోకి వెళ్లనిస్తే సమావేశానికి ఇబ్బంది కలుగుతుందనే ఆలోచనతో వారిని కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా కలెక్టరేట్ వద్ద ఉంటే రాష్ట్ర మంత్రులు రాకపోకలు చేసే సమయాల్లో వారి వాహనాలకు అడ్డుతగులుతారనే వారిని అదుపులోకి తీసుకుని మంత్రులు పర్యటన ముగిసిన అనంతరం వదిలేశారు.

సులభంగా సంపాదించాలనే నకిలీ ఆయిల్ తయారీ

● ఒకసారి జైలుకెళ్లినా మారని నిందితుడు



నకిలీ ఇంజన్ ఆయిల్స్, నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ, నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న కాటన్లు

సూర్యాపేట క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యను అభ్యసించి సులభంగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో నకిలీ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేసి విక్రయించేందుకు వస్తూ ఓ వ్యక్తి సూర్యాపేట జిల్లా పోలీసులకు చిక్కాడు. అతడి నుంచి రూ.2 లక్షల విలువైన నకిలీ ఇంజన్ ఆయిల్‌తో పాటు రూ.14లక్షల విలువ చేసే టొయోటా కారును సూర్యాపేట జిల్లా సీసీఎస్, కోదాడ రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కొత్తపల్లి నర్సింహ విలేకరులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని పాత రాజరాజేశ్వరీపేటకు చెందిన కాకాని నాగ వెంకటేశ్వర్‌రావు విజయవాడలోని పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ చదివాడు. ఆ తర్వాత 1998 నుంచి విజయవాడలోని లూబ్రికెంట్స్ ఇంజన్ ఆయిల్ కంపెనీలో ఇంజన్ ఆయిల్ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగంలో చేరాడు. ఇంజన్ ఆయిల్ తయారీలో అనుభవం వచ్చాక నకిలీ ఇంజన్ ఆయిల్‌ను తీసుకువచ్చి, బ్రాండెడ్ కంపెనీల స్టిక్కర్లు వేసి విక్రయించాలని ఆలోచన చేశాడు. దీనిలో భాగంగా కొల్‌కత్తా నుంచి వివిధ కంపెనీలకు చెందిన స్టిక్కర్లు, లేబుళ్లు, ప్లాస్టిక్ టిన్స్ తెప్పించి విజయవాడలో లభించే మడ్డి ఆయిల్‌ను ఫిల్టర్ చేసి తన ఇంటి వద్దనే బాటిళ్లలో నింపి సీల్ చేసేవాడు. వాటిని దుకాణాల్లో విక్రయిస్తే అనుమానం వస్తుందని భావించి బైక్ మెకానిక్‌లకు లీటర్ ఆయిల్‌ను రూ.200కు విక్రయించేవాడు. 2007లో విజయవాడలోని తన ఇంట్లో నకిలీ ఇంజన్ ఆయిల్‌ను నింపుతుండగా విజయవాడ వన్‌టౌన్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి జైలుకు పంపగా రెండు రోజులు జైలులో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు.

జైలుకు వెళ్లొచ్చినా...

నకిలీ ఆయిల్ తయారీని బంద్ చేసి అగ్రిగోల్డ్ సంస్థలో మార్కెటింగ్ విభాగంలో ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత అగ్రిగోల్డ్ సంస్థ మూసివేయడంతో 2017 నుంచి తిరిగి నకిలీ ఇంజన్ ఆయిల్ తయారు చేసి విక్రయించాలని ఆలోచించాడు. దీంతో మళ్లీ కొలకత్తా నుంచి స్టిక్కర్లు, లేబుళ్లు తెప్పించుకుని నకిలీ ఆయిల్ తయారు చేస్తూ విక్రయిస్తున్నాడు. తాను తయారు చేసిన నకిలీ ఇంజన్ బాటిళ్లను తీఉకుని తన కారులో మిర్యాలగూడ, నేరేడుచర్ల పట్టణాల్లోని బైక్ మెకానిక్‌లకు లీటర్‌ను రూ.200కు విక్రయిస్తున్నాడు. అందులో భాగంగా శుక్రవారం కారులో వివిధ కంపెనీల స్టిక్కర్లతో కూడిన సుమారు రూ.2 లక్షల విలువైన ఆయిల్ డబ్బాలను 20 కాటన్లలో వేసుకుని మిర్యాలగూడ, నేరేడుచర్లలో విక్రయించేందుకు వస్తున్నాడు. ఆ సమయంలో రామాపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సూర్యాపేట సీసీఎస్, కోదాడ రూరల్ పోలీసులు కారును ఆపి తనిఖీ చేయగా ఆయిల్ కాటన్లు కనిపించాయి. వాటికి సంబంధించిన బిల్లులు చూపించమని కోరగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా కొంతకాలంగా నకిలీ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేసి వివిధ లేబుళ్లతో విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో అతడిపై కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి అతడి వద్ద నుంచి నకిలీ ఇంజన్ ఆయిల్ కాటన్లను, కారును స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నకిలీ ఇంజన్ ఆయిల్ తయారు చేసే వ్యక్తిని పట్టుకున్న సీసీఎస్, కోదాడ రూరల్ పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ యు రవీందర్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ వీ ప్రసన్నకుమార్, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, సీసీఎస్ సీఐ శివకుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డితో పాటు సీసీఎస్, కోదాడ రూరల్ సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఎనిమిది జీవాలు మృతి


అర్వపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

అర్వపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో విద్యుదాఘాతంతో సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో ఏడు మూగజీవాలు మృతి చెందాయి. అందులో ఆరు గేదెలు, ఒక ఆవు మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుంచమర్తి గ్రామానికి చెందిన హజారోద్దీన్‌కు చెందిన రూ.1.40 లక్షల విలువైన రెండు గేదెలు, తోట జానయ్యకు చెందిన రూ.70వేల విలువైన గేదె, గోపాల్‌రెడ్డినగర్‌కు చెందిన దేవులపల్లి వీరారెడ్డికి చెందిన రూ.1.40 లక్షల విలువైన రెండు గేదెలు మేతకు వెళ్లగా విద్యుత్ తీగలు తెగి కింద పడడంతో విద్యుదాఘతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. అర్వపల్లి గ్రామానికి చెందిన నోముల అర్వపల్లికి చెందిన రూ.70వేల విలువైన గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. కోడూరు గ్రామానికి చెందిన తాడూరి లాలుకు చెందిన ఆవు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

అడ్డగూడూరు:యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామంలో విద్యుదాఘాతంతో గేదె శుక్రవారం మృతి చెందింది. చిగుళ్ల వెంకన్నకు చెందిన గేదె శుక్రవారం రోజు మాదిరే మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందన్నారు. గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ తీగలు సవరిస్తూ...


లక్ష్మీనారాయణ(ఫైల్)

మఠంపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాలెం గ్రామానికి చెందిన గోపిశెట్టి లక్ష్మీనారాయణ(29) గుండ్లపల్లి వెళ్లే రహదారిలో ఉన్న తన పొలంలో విద్యుత్ లేన్లను సరిచేసేందుకు వెళ్లాడు.

పొలంలోని చెట్టుకు ఉన్న విద్యుత్ వైర్లను సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

టైర్ పేలి మంటలు చెలరేగి ప్రైవేట్ బస్సు దగ్ధం


పూర్తిగా దగ్ధమైన ప్రైవేట్ బస్సు

మోతె, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ బస్సు టైర్ పేలి మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం సూర్యాపేట-ఖమ్మం రహదారిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు ప్రైవేట్ బస్సును డ్రైవర్ ఒక్కడే తీసుకెళ్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మోతెలో ఒకేసారి ముందు టైర్ పేలి, రోడ్డు రాపిడికి మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో డ్రైవర్ బస్సు దిగిపోయాడు. కొద్దిసేపటిలోనే మంటలు బస్సు మొత్తానికి విస్తరించాయి. స్థానికులు పోలీసులు, ఫైర్‌సిబ్బందికి సమాచారం అందజేయడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంతో రహదారి వెంబడి రాకపోకలను రెండు గంటలపైగా నిలిపివేశారు. బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదని ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఆటో ఢీ: నలుగురికి గాయాలు

మోత్కూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ శివారులో ట్రాక్టర్ ఆటో ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ముశిపట్ల గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ధర్మిశెట్టి దేవయ్య ట్రాలీ ఆటోలో కొందరు ప్రయాణికులను ఎక్కించుకుని మోత్కూరు వస్తున్నాడు. ముశిపట్లకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌కు కల్టివేటర్(నాగళ్లు) బిగించుకుని మోత్కూరు నుంచి ముశిపట్లకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోత్కూరు మునిసిపాలిటీ శివారులో ట్రాక్టర్ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ దేవయ్య, ముశిపట్ల గ్రామానికి చెందిన లింగాల ఈశ్వరమ్మ, వెలిమినేటి లక్ష్మమ్మ, మరో ప్రయాణికురాలు మిర్యాల లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు ముశిపట్ల గ్రామస్థులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టు ఒకరికి జైలు, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఆరుగురు వ్యక్తులు మోతాదుకు మించి మద్యం తాగినట్లు తెలిపారు. వారిని శుక్రవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా, మరో ఐదుగురికి కలిపి రూ.6 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్పష్టం చేశారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

వివాదాస్పదంగా మారిన రోడ్డుపై బోరు ఏర్పాటు

హుజూర్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలోని సత్రం రోడ్డులో కొంతమంది పంచాయతీ అనుమతి లేకుండా బోరు వేయడం శుక్రవారం వివాదాస్పదమైంది. బోరు వేస్తుండగా గ్రామస్తులు కార్యదర్శి ప్రవీణ్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో ఆయన అనుమతులు లేకుండా బోరు వేస్తున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంబంధిత వ్యక్తులను వారు అదుపులోకి తీసుకున్నారు. అంతర్గత రోడ్లు అసలే ఇరుకుగా ఉండగా రోడ్లపైన, ఇళ్ల ముందు మెట్ల నిర్మాణం చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై బోర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు.


రోడ్డుపై శుక్రవారం వేసిన బోరు

అర్హులకే సంక్షేమ పథకాలు అందాలి

(3వ పేజీ తరువాయి)



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేస్తామని, నిధులు అవసరమైతే ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, తదితర పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని ఆదేశించారు. పథకాల అమలులో ఎవరైనా అనర్హులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూర్యాపేటలో ఉన్న అటవీ భూములను రక్షించాలని అదే విధంగా అటవీ భూములు పచ్చదనంగా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పేద ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులపై ఉందని ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినా పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తుండటంతో ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా వేలాది మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాసంగిలో 12లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రహదారుల నిర్మాణాలకు ఇప్పటికే రూ.1,700కోట్లు మంజూరు చేశామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా అగ్రభాగాన నిలిచిందన్నారు. గతంతో పోలిస్తే యాసంగిలో 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా రైతులు పండించారన్నారు.



మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

పేదలందరికీ న్యాయం చేయాలి: మంత్రులు

సూర్యాపేట(కలెక్టరేట్), మే 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట కలెక్టరేట్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి వ్యవసాయం, భూభారతి, ఇరిగేషన్, ఇందిరమ్మ ఇళ్లపై నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాల కలెక్టర్లు తేజస్ నందలాల్ పవార్, ఇలా త్రిపాఠి, హనుమంతరావు తమ జిల్లాలకు సంబంధించి ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వ్యవసాయంపై వివరాలను తెలియచేశారు. సమావేశం అనంతరం మంత్రులకు జ్ఞాపికలు అందజేయడంతో పోలీసులు గౌరవం వందనం చేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కొత్తపల్లి నర్సింహ మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అదే విధంగా సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోమంత్రులకు కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పేదలందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అవి వారి మాటల్లోనే..



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు

ఈ సమావేశంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవెటి వెంకన్నయాదవ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సుధీర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, రాయల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలి



ఇళ్లు లేని పేదలకు అందరికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను అందించాలి. గుడిసెల్లో నివసించే వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే ఎంతో సంతోషిస్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి కావడం సంతోషదాయకం.

- కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ

కల్తీ విత్తనాల బారిన పడకుండా రైతులను కాపాడాలి



కల్తీ విత్తనాలు, ఎరువుల బారిన పడకుండా రైతులను ప్రభుత్వం కాపాడాలి. ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు వచ్చినప్పటికీ ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారణ చేయాలి.

- నెల్లికంటి సత్యం, ఎమ్మెల్సీ

ఎస్సారెస్పీ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

ఎస్సారెస్పీ ద్వారా సూర్యాపేట జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలి. యాసంగిలో చివరి ఆయకట్టుకు నీరు రానందున రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు రాకుండా చూడాలి. చాలా చోట్ల అనర్హులను ఎంపిక చేశారని ప్రచారం జరుగుతోంది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలి.

- పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్.



అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించొద్దు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అనర్హుల కు ఇళ్లు కేటాయించొద్దు. ఇందిరమ్మ ఇళ్ల తుది జాబితాను జాగ్రత్తగా పరిశీలించి అర్హులను మాత్రమే ఎంపిక చేయాలి. ధాన్యం సేకరణలో కొంత మంది మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో అనర్హులు ఉంటే ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా చర్యలు తీసుకోవాలి.

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ, భువనగిరి

ధాన్యం సేకరణను పూర్తి చేయడంతో రైతుల్లో సంతోషం



యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణను సకాలంలో పూర్తి చేయడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు పనులు కొనసాగుతున్నాయి. అవి కూడా త్వరగా పూర్తయితే ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ పథకాలను అధికారులు క్షేత్రస్థాయిలో అర్హులకు అందించాలి.

- బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, ఆలేరు

ఇసుక డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందించేందుకు అవసరమైన ఇసుక డంపింగ్ యార్డులను మిర్యాలగూడెంలో ఏర్పాటు చేయాలి. దూర ప్రాంతం నుంచి ఇసుకను రవాణా చేసుకోవాలంటే లబ్ధిదారులు ఇబ్బంది పడతారు.

- బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, మిర్యాలగూడ

ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచాలి



వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచాలి. వానాకాలంలో సాగు చేయాల్సిన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అవకతవకలకు తావులేకుండా చూడాలి.

- కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగార్జునసాగర్

వైభవంగా ఊంజల్ సేవోత్సవాలు



ఊంజలీ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు



యాదగిరిగుట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొల్పి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల నుంచి ఆలయ ఖజానాకు రూ. 46,47,383ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.



మట్టపల్లిలో కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

సంప్రదాయ బద్ధంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యాకల్యాణం వేదపండితులు తూ మాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయచార్యులు పర్యవేక్షణలో సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. స్వామి, రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశార మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానాలు, కేసులు



దుకాణంలో తనిఖీ చేస్తున్న మునిసిపల్, పోలీస్ అధికారులు

దేవరకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామని దేవరకొండ మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని పలు ప్లాస్టిక్ హోల్‌సేల్ దుకాణాల్లో మునిసిపల్ అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనంతరం యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించినా, నిల్వ చేసినా రూ.25వేల వరకు జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. వీధి వ్యాపారులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు విక్రయిస్తే రూ.2500 నుంచి రూ.5వేల వరకు జరిమానాలు విధిస్తామని తెలిపారు. ప్లాస్టిక్‌ను కట్టడి చేయడానికి వ్యాపారులందరూ సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో మునిసిపల్ అధికారులు శుక్రనాయక్, సురేష్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 32మంది విద్యార్థుల డీబార్

నల్లగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో శుక్రవారం 32మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా స్క్వాడ్ బృందాలు డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన 4వ సెమిస్టర్ పరీక్షలకు 6,148 మంది విద్యార్థులకు 5,632 మంది విద్యార్థులు హాజరు కాగా, 492మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో 24మంది డీబార్ కాగా, నల్లగొండలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, దేవరకొండలోని భవిత డిగ్రీ కళాశాలలో ముగ్గురు, భారతి డిగ్రీ కళాశాలలో నలుగురు, మాల్‌లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ముగ్గురు, మిర్యాలగూడలోని విజేత డిగ్రీ కళాశాలలో ఒకరు, సూర్యాపేటలోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఇద్దరు, స్పందన డిగ్రీ కళాశాలలో ముగ్గురు, రాకేష్ బీఈడీ కళాశాలలో ఇద్దరు, భువనగిరిలోని ఎస్ఎల్ఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఐదో సెమిస్టర్ పరీక్షలకు 1524 మంది హాజరు కావాల్సి ఉండగా, 1324మంది విద్యార్థులు హాజరయ్యారు. 192మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎనిమిది మంది విద్యార్థులు డిబార్ కాగా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నల్లగొండలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఒకరు, నీలగిరి డిగ్రీ కళాశాలలో ఒకరు, టీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఒకరు, చౌటుప్పల్‌లోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఒకరు, సూర్యాపేటలోని శ్రీ చిల్డ్రెన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, మిర్యాలగూడలోని విజేత డిగ్రీ కళాశాలలో ఒకరు డీబారయ్యారు.

చింతపల్లిలో వైభవంగా పల్లకీ సేవ

చింతపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న 18వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని గురువారం రాత్రి సాయినాథుని పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. మండలకేంద్రంలో గుర్రంబండిపై సాయినాథుని విగ్రహాన్ని ఏర్పాటుచేసి మండల పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరెె కృష్ణయ్య, గోశాల ఇన్‌ఛార్జి కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో పల్లకీసేవలో పాల్గొన్న ట్రస్టు సభ్యులు

ఖేలో ఇండియా స్పాన్సర్‌షిప్‌కు శశాంక్



మిర్యాలగూడ టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శశాంక్ వనమాల ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా స్పాన్సర్‌షిప్‌కు ఎంపికైనట్లు జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో శశాంక్ ప్రతిభను గుర్తించిన ఖేలో ఇండియా బృందం స్పాన్సర్‌షిప్‌కు ఎంపిక చేసిందన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా ప్రోగ్రాం ద్వారా క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తుందన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. క్రీడాకారుడు శశాంక్‌ను ఎంబీఏ ఆధ్వర్యంలో సన్మానించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు పవన్‌కుమార్

హాలియా, మే 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈనెల 26వ తేదీన జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ ఎంపికలో హాలియాలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్. పవన్‌కుమార్ ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి జూన్ 1వ తేదీ నుంచి జింఖానా గ్రౌండ్, హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ మోదాల రవీందర్ తెలిపారు. విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక

భువనగిరి రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లో ఈ నెల 31నుంచి జూన్ 1వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు యాదాద్రి భువనగిరి జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కొండ్రెడ్డి శ్రీకాంత్ తెలిపారు. 39వ రాష్ట్ర సబ్ జూనియర్, 13వ రాష్ట్రస్థాయి జూనియర్, 42వ తెలంగాణ స్టేట్ జూనియర్, తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అధ్యక్షుడు కొండ సైదులు, కోశాధికారి వి రవికుమార్, కోచ్‌లు కొండాపురం కృష్ణాకుమార్, సాయి పాల్గొన్నారు.



శాలిగౌరారం ప్రాజెక్టుకు జలకళ

● 17 అడుగులకు చేరిన ప్రాజెక్టు నీటి మట్టం ● నాలుగు రోజుల్లో పూర్తిగా నిండే అవకాశం



జలకళ సంతరించుకున్న శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం, మే 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టులో నీరు రోజురోజుకు పెరుగుతూ శుక్రవారం సాయంత్రం వరకు 17అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు కాగా, ప్రస్తుతం 17 అడుగులకు చేరుకోవడంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో నాలుగు అడుగులు చేరితే పూర్తిస్థాయి నీటిమట్టం చేరి అలుగు పోయనుంది. ప్రస్తుతం పల్లివాడ మూసినది హెడ్ రెగ్యులేటర్ నుంచి ఫీడర్ ఛానల్ ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

ఇప్పటికే ఫీడర్ ఛానల్ పరిధిలోని చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయి. శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు కింద ఎనిమిది గ్రామాల్లో ఆరు వేల ఎకరాల్లో వరిపంటను సేద్యం చేయనున్నారు. జూన్ రెండో వారంలో వానాకాలం సీజన్‌కు గాను ప్రాజెక్టు నీటిని కుడి, ఎడమ కాల్వల ద్వారా అధికారులు విడుదల చేయనున్నారు.



సీపీఐ మండల కార్యదర్శిగా శ్రీనివాస్

మునుగోడు రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా మునుగోడు మండల కేంద్రానికి చెందిన చాపల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని సింగారం గ్రామంలో గురువారం నిర్వహించిన పార్టీ మహాసభలో 33మంది మండల కౌన్సిల్ సభ్యులు, 12 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యుడు గుజరామచంద్రన్ పేర్కొన్నారు.



రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

మునుగోడు రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి పేర్కొన్నారు. జూన్ 1న ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రహదారులకు మహర్దశ



బీటీరోడ్డుగా మారనున్న ఎలుగలగూడెం రోడ్డు

- డబుల్ రోడ్లుగా మారనున్న గ్రామీణ రోడ్లు
- మునుగోడు నియోజకవర్గానికి రూ.163.85 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మునుగోడు నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న గ్రామీణ ప్రాంత రోడ్డుకు మహర్దశ కలగనుంది. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మునుగోడు నియోజకవర్గంలో గుంతలు పడి కంకర తేలిన రోడ్లు మరమ్మతులకు నోచుకోనున్నాయి. గ్రామీణ ప్రాంత రోడ్లకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కృషితో రూ.164.85 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల రోడ్లకు నిధులు మంజూరు కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మునుగోడు రూరల్)

మారుతున్న కాలానికి అనుగుణంగా రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్య పెరుగుతుంది. ఈ నేపథ్యంలో రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో రహదారులను 3.75 మీటర్ల నుంచి 5.5 మీటర్ల వరకు వెడల్పు పెంచాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సూచనతో మొదటగా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో 3.75 మీటర్ల నుంచి 5.5 మీటర్ల వరకు వెడల్పు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మునుగోడు నియోజకవర్గంలోని 43 రోడ్లకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సీఆర్ఆర్ 2024-25 నిధుల నుంచి రూ.163.85 లక్షలు మంజూరయ్యాయి. దీంతో టెండర్లు పిలిచి త్వరలో పంచాయతీరాజ్ అధికారులు పనులు ప్రారంభించనున్నారు.

గ్రామాల వారీగా రోడ్ల వెడల్పు

మునుగోడు మండలంలో పులిపలుపుల నుంచి బీరెల్లిగూడెం వరకు రూ. 3.35కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఊకోండి నుంచి తాళ్లవెల్లంల వరకు రూ.2.40 కోట్లు, పులిపలుపుల నుంచి ఊకోండి అడ్డరోడ్డు వరకు రూ. 4.70 కోట్లు, కల్వలపల్లి నుంచి కాశవారిగూడెం వరకు రూ.6.50 కోట్లు, ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డు నుంచి రత్తుపల్లి గ్రామం వరకు రూ.60లక్షలు, ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డు నుంచి గంగోరిగూడెం వరకు రూ.2.80 కోట్లు, వెల్మకన్నె నుంచి కల్వకుంట్ల వరకు రూ. 5 కోట్లు, కచలాపురం నుంచి వయా సింగారం నేరటోనిగూడెం రూ. 5కోట్లు, ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డు నుంచి గుండ్లోరిగూడెం వరకు రూ.2.20కోట్లు, ఆర్‌బీ రోడ్డు నుంచి కొరటికల్ రూ.80లక్షలు, చొల్లేడు నుంచి బోడంగిపర్తి వరకు రూ.7 కోట్లు మంజూరయ్యాయి.

నాంపల్లి మండలంలో...

కేతేపల్లి నుంచి తిరుమలగిరి వరకు రూ.3.20కోట్లు, కొండమల్లేపల్లి నుంచి బండ తిమ్మాపురం రూ.2.70 కోట్లు, అంతంపేట నుంచి గట్టుప్పల్ వరకు రూ.6.30 కోట్లు, బట్లపల్లి నుంచి వట్టిపల్లి వరకు రూ.2.50 కోట్లు, నాంపల్లి మండలంలోని చిట్టెంపహాడ్ నుంచి తిరుమలగిరి వరకు రూ.6 కోట్లు, మునుగోడు మండలంలోని పలివెల - సర్వేలు రోడ్డు నుంచి కోతులారం గ్రామంలోకి రూ.3.70కోట్లు, చలిమెడ నుంచి బొత్తళ్లగూడెం రూ.1.75 కోట్లు, కిష్టాపురం రోడ్డు నుంచి ఎలగలగూడెం వరకు రూ.4.50 కోట్లు, చండూరు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దుబ్బకాల్వ రోడ్డు వరకు రూ.85లక్షలు, చండూరు ఆర్అండ్‌బీ రోడ్డు వయా బుడగ జంగాలకాలనీ లక్ష్మీదేవిగూడెం వరకు రూ. 1.50 కోట్లు, కచలాపురం - కిష్టాపురం చిన్నకాపర్తి రూ.6.50 కోట్లు, ఓల్డ్ కల్వకుంట్ల నుంచి కొంపెల్లి- కొండపురం రోడ్డు వయా వెంకటేశ్వర నగర్ రూ.3 కోట్లు, మెయిన్ రోడ్డు నుంచి సోలిపురం వరకు రూ.3.85కోట్లు మంజూరయ్యాయి.

చండూరు మండలంలో

చండూరు మెయిన్ రోడ్డు నుంచి జోగిగూడెం వరకు రూ.1.70కోట్లు, పుల్లెంల నుంచి బోడంగిపర్తి వరకు రూ. 6.20కోట్లు, శిర్దేపల్లి నుంచి తాస్కానిగూడెం వరకు రూ.3.85 కోట్లు, లక్కినేనిగూడెం నుంచి చొప్పరివారిగూడెం వరకు రూ.2.70 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పడమటితాళ్ల వరకు రూ.3.90 కోట్లు, మెయిన్ రోడ్డు నుంచి దుబ్బగూడం వయా ఉడతలపల్లి రూ.1.45 కోట్లు, కొరటికల్ నుంచి శిర్దేపల్లి వరకు రూ.7.80 కోట్లు, తిమ్మారెడ్డిగూడెం నుంచి మల్లగుట్ట వరకు రూ.2.75 కోట్లు, పుల్లెంల నుంచి గొల్లగూడెం వరకు రూ. 4.10 కోట్లు గట్టుమల్లేపల్లి నుంచి తుమ్మల పల్లి వరకు రూ.4.55కోట్లు మంజూరయ్యాయి.

మర్రిగూడ మండలంలో...

సరంపేట నుంచి శివన్నగూడెం వరకు రూ.1.80 కోట్లు, చండూరు మండలం తిమ్మారెడ్డిగూడెం నుంచి తుమ్మలపల్లి వరకు రూ.3.90 కోట్లు, చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట్ - కాట్రేవు నుంచి ఎల్లంబాయి వరకు రూ. 2.15 కోట్లు, డి.నాగారం నుంచి పీపల్‌పహాడ్ అల్లాపూర్ రోడ్డు వయా మహావిష్ణు టెంపుల్ వరకు రూ.4 కోట్లు మంజూరయ్యాయి.

అల్లాపూర్ తుంబాయి తండా రోడ్డు నుంచి సరళ మైసమ్మ టెంపుల్ వరకు రూ.8కోట్లు, సింగరాయ చెరువు నుంచి తమ్మడోనీ బావి రూ.5.70 కోట్లు, పెద్దకొండూరు నుంచి సప్పిడివారిగూడెం రూ.5.20 కోట్లు, చిన్న కొండూరు రోడ్డు జూబ్లకపల్లి నుంచి మసీదుగూడెం వయా తోకోహెల్క రూ.3.90 కోట్లు, పంతంగి విలేజ్ నుంచి శనిగలగుట్ట వరకు రూ. 3.50కోట్లు మంజూరయ్యాయి.

సమాచారం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు

● తెలిపిన జిల్లా టీడీపీ నేతలు



చంద్రబాబుకు నమస్కరిస్తున్న శేఖర్‌రెడ్డి

నల్లగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లకు అండగా అసోసియేషన్

గట్టుప్పల్, మే 30 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్లకు రామాంజనేయ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ అండగా ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు రావుల ఎల్లప్ప అన్నారు. లారీ డ్రైవర్ అక్కినపల్లి వంశీ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం తేరటిపల్లి గ్రామంలో వంశీ కుటుంబ సభ్యులకు లారీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన రూ. 25వేల నగదు అందజేసి పరామర్శించారు.

వైభవంగా బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం

మర్రిగూడ, మే 30 (ఆంధ్రజ్యోతి): మేటి చందాపురం గ్రామంలో బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం భక్తులు బొడ్రాయి వద్దకు చేరుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే బొడ్రాయి వార్షికోత్సవ సందర్భంగా పూజారులు హోమయజ్ఞం నిర్వహించారు. మంగళ తోరణాలతో మంగళ వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కుంభం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఉరిపక్క సరిత నగేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యూసుఫ్ అలీ, ఏరుకొండ అబ్బయ్య, నాయకులు అశోక్‌గౌడ్, ఐతగోని యాదగిరిగౌడ్, లవంగి భిక్షం, గణేష్, శ్రీనివాస్, హుస్సేన్, సైదులు, రవీందర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నాంపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరళ్లపల్లికి చెందిన ఆక రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ సర్పంచ్ సయ్యద్ గఫార్ రూ.10వేల సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ బచ్చనబోయిన రమేష్, గునేబోయిన యాదయ్య, మల్లయ్య, రాములు, మాద రమేష్, బచ్చనబోయిన కొండల్, వంగూరి సైదులు, ఉడుత పర్వతాలు, ఎడ్ల వెంకన్న, శ్రీరాములు, మేకల రాజు, కర్నాటి అంజి, పల్లె క్షత్రయ్య, చందుపాషా, సైదుహుస్సేన్, హుస్సేన్, యాదయ్య, వెంకన్న, వెంకటేష్, చంద్రయ్య, అంజి, నర్సింహ, లింగయ్య, నరసమ్మ పాల్గొన్నారు.

దేవాలయ భూములకు ముగిసిన కౌలు వేలం



కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కనగల్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.గౌరారం గ్రామ పరిధిలో ఉన్న అనుముల మండలం మారెపల్లి గ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవసాయ భూములకు ఈ ఏడాదికి గాను కనగల్ రైతు వేదికలో రెండు రోజుల పాటు జరిగిన కౌలు వేలం శుక్రవారం ముగిసింది. మొత్తం 70 ప్లాట్లలో 189 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో 164 ఎకరాల భూమిని రైతులు రూ. 14లక్షల 98 వేలకు వేలం పాడి కౌలు హక్కులను దక్కించుకున్నారు. కాగా వ్యవసాయానికి అనువుగా లేని 14 ఎకరాల భూమికి కౌలు రాలేదని, గతేడాదితో పోల్చితే ఈ ఏడాది కౌలు ఆదాయం పెరిగిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఏసీ కె.భాస్కర్, పరిశీలకులు పి.ఏడుకొండలు, ఆలయ కార్యనిర్వహణాధికారి అంబటి నాగిరెడ్డి, రెవెన్యూ అధికారి శంకర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మెండు ఏడుకొండలు, నాయకులు గదిదె శ్రీను, గండు యాదయ్య, ఆలయ సిబ్బంది నర్సిరెడ్డి, మల్లారెడ్డి, వేమన తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి పట్టణంలో ఆధ్యాత్మిక సందడి



గ్రామ దేవతల విగ్రహాలకు బియ్యం సమర్పిస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పట్టణంలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠా సందడే కనపడుతోంది. మునుగోడు రోడ్డు నుంచి అమ్మనబోలు రోడ్డు వరకు ఏర్పాటు చేసిన మైకుల్లో భక్తి గీతాలు, యాజ్ఞికుల వేదమంత్రాలు వినిపిస్తున్నాయి. మారెమ్మ, కోట మైసమ్మ, కట్ట మైసమ్మ, ముత్యాలమ్మ గ్రామ దేవతలకు భక్తుల విరాళాలతో పట్టణంలో నూతన ఆలయాలను నిర్మించారు. గ్రామ దేవతల దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ప్రారంభమైన ప్రతిష్ఠాపన ఉత్సవాలు 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. విగ్రహాల తయారీకి సుప్రసిద్ధమైన శ్రీకాళహస్తి నుంచి విగ్రహాలను తెప్పించారు. సిద్ధ హస్తులైన శిల్పులచే 'అమ్మ'ల మూల రూపాలు ఉట్టిపడేలా విగ్రహాలను కృష్ణ శిలతో తయారు చేయించారు.

విగ్రహాలకు బియ్యం సమర్పించిన భక్తులు

జలాధివాసం అనంతరం ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా గ్రామ దేవతల విగ్రహాలకు భక్తులు బియ్యాన్ని తెచ్చి సమర్పించారు. పట్టణంలోని ప్రతీ ఇంటి నుండి బియ్యాన్ని తెచ్చిన భక్తులు గ్రామ దేవతల విగ్రహాలపై భక్తితో సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మంటపంలో యాజ్ఞికులు బేతోజు సత్యనారాయణ సిద్ధాంతి శిష్యబృందంచే స్థాపిత మంటప దేవతా పూజలు, మూల మంత్ర హోమాలు, పుష్ప, ఫల, వస్త్ర, ధాన్యాధివాసాలను నిర్వహించారు.

ప్రమాదకరంగా కంపచెట్లు



రోడ్డుపై పడిఉన్న కంప చెట్లు, మూలమలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్లు

నల్లగొండ రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు వెంట కంప చెట్లు ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నల్లగొండ మండలం పరిధిలోని పానగల్ నుంచి దండెంపల్లి గ్రామ పరిసర ప్రాంతంలోని ప్రధాన రహదారి నల్లగొండ టూ సూర్యాపేటలకు వెళ్లే రోడ్డు కంపచెట్లు పడిపోయి ఉన్నాయి. మూడు రోజుల క్రితం ఈదురుగాలులకు రహదారి వెంట ఉన్న కంప చెట్లు విరిగి రోడ్డు పడిపోయి ఉన్నాయి. దీంతో ఈ సమీపంలో మూలమలుపు ఉండటంతో వాహనం దగ్గరికి వచ్చే వరకు కనిపించడం లేదు. ఈ ప్రాంతం నల్లగొండ మునిసిపాలిటీ కిందికి వస్తుందా లేక గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుందా అనే విషయంపై అధికారులు స్పందించడం లేదు.

రైతుల ఆదాయం రెట్టింపే మోదీ లక్ష్యం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి



చిట్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం 14 పంటలకు కనీస మద్దతు ధర పెంచినందుకు శుక్రవారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి పాటుపడుతున్న ప్రధాని నరేంద్రమోదీకి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల పీచమణిచారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలు కష్టపడి పనిచేసి రానున్న స్థానిక సంస్థల్లో సత్తాచాటాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, నాయకులు నకిరేకంటి మొగులయ్య, మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహలింగం, పల్లె వెంకన్న, పాపని వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం

నల్లగొండరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి సలీం అన్నారు. సీఐటీయూ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని టెలిఫోన్ ఎక్ఛేంజ్ వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సంస్కరణవాద సంఘాలు కార్మికుల సమస్య పరిష్కారానికి మూలమని పేర్కొన్నారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేయకుండా యాజమాన్యాలపై ఉదారవాద స్వభావంతో వ్యవహరిస్తున్న సమయంలో ఐక్యత పోరాటం అనే నినాదంతో సీఐటీయూ ఆవిర్భవించిందని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలను స్వతంత్ర ఫెడరేషన్లు మరియు అసోసియేషన్లతో కేంద్రప్రభుత్వ అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, జాతీయ సార్వత్రిక సమ్మె నిర్వహించిన ఘనత సీఐటీయూదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, సీఐటీయూ పట్టణ నాయకులు అవుట రవీందర్, తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జక్కుల రవికుమార్, పట్టణ కార్యదర్శి పెరిక కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్ల సంజీవ, దర్శనం ఎల్లమ్మ కత్తుల పద్మ మేడి సుగుణమ్మ రామలింగయ్య తీగల ఎల్లమ్మ బొప్పని శ్రీను పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం




నల్లగొండ పట్టణంలోని డీఈవో కార్యాలయం ఎదుట పొంగుతున్న మోరీ



రామగిరి వద్ద మార్కెట్‌లో నిలిచిన వర్షపు నీరు

వానొచ్చె.. వరదొచ్చె...



దండెంపల్లి వద్ద వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న కారు

నల్లగొండ పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షంతో పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి. దేవరకొండ రోడ్డులో నీరు నిలబడటంతో వాహనదారుల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

● ఫొటోగ్రాఫర్, నల్లగొండ



నల్లగొండ పట్టణంలోని ఆర్పీ రోడ్డులో పరిస్థితి



ఆర్పీ రోడ్డులో మోకాళ్ల లోతులో వర్షపు నీరు

బాధితునికి ఎల్వోసీ అందజేత



నిమ్స్‌కు వెళ్లి ఎల్వోసీని అందజేస్తున్న బింగి మహేష్

నార్కట్‌పల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండ్లాయి గ్రామానికి చెందిన చింత సహదేవులు తీవ్ర అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరారు. అతని అత్యవసర వైద్య చికిత్స గురించి గ్రామ కాంగ్రెస్ నాయకుడు బింగి మహేష్ ఎమ్మెల్యే వీరేశం దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే సహకారంతో రూ.5లక్షల ఎల్వోసీ మంజూరైంది. నిమ్స్‌కు వెళ్లి సహదేవునికి బింగి మహేష్ ఎల్వోసీ లేఖను అందజేశాడు. మహేష్ వెంట చింత శివశంకర్, సునీల్, విజయ్, సతీష్, విక్రమ్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గట్టుప్పల్, మే 30(ఆంధ్రజ్యోతి): గట్టుప్పల్ మండల కేంద్రంలో కంఠమహేశ్వర స్వామి, సూరమాంబ తల్లి మూడవ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన గణపతి పూజ, అభిషేక హోమంలో గౌడ కులస్థులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు బండారు చంద్రయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేముల వీరేశానికి మంత్రి పదవి ఇవ్వాలి

కేతేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే వేముల వీరేశానికి స్థానం కల్పించాలని చెరుకుపల్లి మాజీ సర్పంచ్ చినబొస్క ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘకాలంగా అణచివేతకు గురవుతున్న మాదిగలకు మంత్రి పదవి ఇచ్చి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన వీరేశానికి మంత్రి పదవి దక్కాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. స్వంత ఖర్చుతో ఉద్దీపన సంస్థను స్థాపించి స్వంత ఖర్చుతో పేద వర్గాల పిల్లలు ఆంగ్లమాధ్యమంలో ఉచిత విద్యను అందిస్తున్న వీరేశానికి మంత్రి దక్కితే నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు.


పక్షపాత బాధితునికి మందుల అందజేత



బాధితునికి మందులు అందజేస్తున్న పొట్టబత్తుల సత్యనారాయణ

నల్లగొండ కల్చరల్, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మానగర్ కాలనీ చెందిన పవర్‌లూమ్ కార్మికుడు అనుమాల శ్రీనివాస్ పక్షవాతంతో మంచాన పడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న బాధితునికి నల్లగొండ జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పొట్ట బత్తుల సత్యనారాయణ మూడు నెలలకు సరిపోను రూ. 15వేల విలువైన మందులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాటి యాదగిరి, ఉపాధ్యక్షుడు గంజి రామలింగం, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, పున్న రమేష్, వనం చంద్రశేఖర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
3
శనివారం 31 మే 2025



వైభవంగా ఊంజలి సేవోత్సవం



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా నిత్య పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా సాగాయి. 5



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు

అర్హులకే సంక్షేమ పథకాలు

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకే అందాలని, ఎట్టి పరిస్థితుల్లో అనర్హులను ఎంపిక చేయవద్దని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి వ్యవసాయం, భూభారతి, ఇరిగేషన్, ఇందిరమ్మ ఇళ్లపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి తుమ్మల మాట్లాడారు.
- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట (కలెక్టరేట్)

అందరి సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాను సర్వతోముఖాభివృద్ధి చేయాలన్నారు. నల్లగొండ జిల్లా వ్యవసాయం, రాజకీయాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తయితే గ్రావిటీ ద్వారా నీటిని తీసుకోవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అధికారులు వెంటనే కలెక్టర్లకు తెలపాలన్నారు.రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఏఈవోల కొరత ఉందన్నారు. నల్లగొండ జిల్లాకు అదనంగా ఏఈవోలు కావాలని మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు ఏఈవోలను నియమించుకునే అధికారం కలెక్టర్లకు ఇచ్చామని, వెంటనే అవసరమైనంత మంది ఏఈవోలను నియమించుకుని అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో వరి పంట సాగును తగ్గించి ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోందన్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల మధ్యలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్నారు.

కి రేషన్‌కార్డు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న ఐదేళ్లలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల్లో జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. డెన్మార్క్ నుంచి ప్రపంచంలోనే అత్యంత అత్యాధునిక టెక్నాలజీ తీసుకువచ్చి హెలికాప్టర్ ద్వారా సర్వే చేయించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పిలాయిపల్లి, బునాదిగానికాల్వ, ధర్మారెడ్డిపల్లి ప్రాజెక్టుల కోసం రూ.500 కోట్లు, డిండి ప్రాజెక్టు కోసం రూ.1,500 కోట్లు మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయసముద్రం ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. త్వరలోనే ఆ పనుల ను కూడా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. దేవాదుల ఫేస్-3 ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి నీళ్ల తీసుకువస్తామన్నారు. నాగార్జునసాగర్ ఎత్తిపోతల, నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి అన్ని ప్రాజెక్టులకు ఆయకట్టు ప్రణాళికలను సిద్ధం చేసి నీటి విడుదల విషయాలను ముందే ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడిక పేరుకుపోయిందని, త్వరలో అన్ని ప్రాజెక్టుల్లోని పూడిక తీత పనులు ప్రారంభించి ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో మొదలు పెట్టిన డబుల్

- మిగతా 5వ పేజీలో...

పారదర్శక పాలన అందించాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో అవినీతికి ఆస్కారం ఇవ్వకుండా పేదలకు పారదర్శకమైన, అవినీతి రహిత పాలన అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో అధికారుల అలసత్వం, అవినీతి ఎక్కువగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వాటన్నంటినీ విడనాడాలని హెచ్చరించారు. రీజనల్ రింగ్ రోడ్డుకు రూ.22 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. యాసంగిలో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే 20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేశామన్నారు. రైతులు పండించిన సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లర్ల ద్వారా కస్టమ్ మిల్లింగ్ చేయించి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డులోని ప్రతీ ఒక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా అందిస్తున్నామన్నారు. గతంలో రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందుల కు గురి చేశారని, ప్రస్తుతం అడిగిన ప్రతీ ఒక్కరి

ఆరోగ్యానికి
'పొగ'బెడుతూ

ప్రాణాలకు ముప్పని తెలిసినా ధూమపానం చేస్తూనే ఉన్నారు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల యువతకు ధూమపాన వ్యసనం అధికమైందని తెలుస్తోంది. విద్యార్థులు సైతం ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. నేడు ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. 200 మందిని సర్వే చేయగా 95 మంది పొగ తాగుతున్నట్లు తెలిపారు. అందులో అత్యధికులు యువత, విద్యార్థులు ఉండటం గమనార్హం. దీనికి తోడు అనారోగ్యం పాలవుతామని కూడా వారికి తెలుసని సర్వేలో వెల్లడైంది. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని తెలుసని 150 మంది అంగీకరించారు. పక్కవారు పొగ తాగుతుంటే ఏం మాట్లాడకుండా వెళ్లిపోయేవారు 150 మంది ఉండటం గమనార్హం.

- వివరాలు 4వ పేజీలో

సాగుకు సన్నద్ధం

రోళ్లు పగిలే ఎండలు కాయాల్సిన రోహిణీ కార్తెకు ముందే అనూహ్యంగా తొలకరి వాన పలకరించడంతో రైతులు మురిసిపోయారు. నైరుతి పవనాలు ముందస్తుగానే ప్రవేశించడంతో ముందస్తు వానలు పడుతున్నాయి. వాతావరణం చల్లబడి ప్రతి రోజూ చిరుజల్లులు కురుస్తుండడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆరుతడి పంటల సాగుకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. రైతులు సంప్రదాయకంగా విశ్వసించే మృగశిర కార్తె సైతం జూన్ 8న ప్రవేశించనుండడం, ఇప్పటికే వానలు బలంగా కురుస్తుండడంతో ఈ వారం తర్వాత ఆరుతడి పంటలకు విత్తనాలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



- ఆరుతడి పంటల సాగుకు దుక్కులు సిద్ధం చేసిన రైతులు
- మృగశిరలో వాన పడగానే విత్తనాలు వేసేలా ప్లాన్
- విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచిన ప్రభుత్వం
- ఎలాంటి కొరత రానివ్వబోమని స్పష్టతనిస్తోన్న వ్యవసాయ శాఖ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని మెట్టప్రాంతాల్లో ప్రధానంగా పత్తి, కంది, జొన్న సాగుచేసే భూములను విత్తనాలు వేయడానికి అనుకూలంగా దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. మరోవైపున విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 7.94లక్షల ఎకరాల్లో పత్తి, 27వేల ఎకరాల్లో కంది, 37వేల ఎకరాల్లో జొన్న, పెసర, సజ్జ వంటి ఇతర ఆరుతడి పంటలు సాగు చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వానాకాలం సీజన్ ముందస్తుగానే మొదలవుతుండడంతో వ్యవసాయాధికారులు సైతం అప్రమత్తమయ్యారు. జిల్లాలో పత్తి సాగు నిమిత్తం ప్రభుత్వం ధ్రువీకరించిన 20 కంపెనీలకు చెందిన 19.75 లక్షల పత్తి విత్త న ప్యాకెట్లు (ఒక్కో ప్యాకెట్ 450 గ్రాములు) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా 2,254 క్వింటాళ్ల కంది విత్తనాలు, మరో 3వేల క్వింటాళ్ల ఇతర విత్తనాలు అందుబాటు లో ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేదని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. పత్తి సాగుచేసే రైతులు సైతం ఇప్పటికే స్థానిక డీలర్ల వద్ద, ఏపీలోని గుంటూరు, మాచర్ల ప్రాంతాల్లోని డీలర్ల నుంచి అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, గద్వాల ప్రాంతాలలోని డీలర్ల నుంచి విత్తనాలు కొనితెచ్చుకొని సిద్ధంగా పెట్టుకున్నారు. జూన్ నెలకు సంబంధించి అవసరమైన 57,569 మెట్రిక్‌టన్నుల యూరియా, 52,860 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 14,317 మెట్రిక్‌టన్నుల ఇతర ఎరువులు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు. వచ్చే ఆరునెలలకు అవసరమైన ఎరువులు బఫర్ స్టాక్‌లో ఉన్నాయని రైతులెవరూ ఎరువుల కోసం ఇబ్బందిపడాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు.

బోరు బావుల కింద నారుమళ్లు సిద్ధం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 12.35 లక్షల ఎకరాల వరి సాగవుతుందని అంచనావేశారు. ఇందులో నాగార్జునసాగర్, మూసీ, కాళేశ్వరం, ఎస్‌ఆర్‌ఎస్పీ రెండోదశ కింద దాదాపు 8లక్షల ఎకరాలు సాగయితే, మిగిలిన 4.35లక్షల ఎకరాలు బోరుబావుల కింద, చెరువుల కింద సాగవుతుంది. ప్రాజెక్టుల కింద ఆగస్టు వరకు సాగుకు సమయం ఉండగా, బోరుబావులకింద సాగు చేసే రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో వరిసాగుకు 2.70లక్షల క్వింటాళ్ల వరివిత్తనాలు అవసరమవుతాయని, ప్రస్తుతం 66వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు కొరత లేకుండా వరివిత్తనాలందించేందుకు ఏర్పాట్లు చేశామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన 'దర్బార్' కార్యక్రమంలో ఆయన సాయుధ సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల పాత్ర కీలకమని అన్నారు. సిబ్బంది విధులను చక్కగా నిర్వహించడంతో పాటు ఆరోగ్యం, కుటుంబ సభ్యుల సంక్షేమంపై దృష్టిసారించాలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అందుకోసం ప్రతీ ఒక్కరు వ్యాయామం, క్రీడలు, యోగ అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలన్నారు. ఈజీ మనీ అంటూ ఆన్‌లైన్ యాప్‌లలో ఇన్వెస్ట్ చేసి మోసపోవద్దని సూచించారు. ఆర్థికపరంగా ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందరికీ సమానంగా డ్యూటీలు వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ వెంట ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో శ్రీనివాసులు, ఆర్‌ఐలు సంతోష్, సూరప్పనాయుడు, శ్రీనివాస్, హరిబాబు, తదితరులు ఉన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించాలి

బక్రీద్ పర్వదినాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మత పెద్దలతో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండుగలను నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో పీస్ కమిటీ సభ్యులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని మతాల వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇతర జిల్లాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పోలీస్‌శాఖ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది సమన్వయంతో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. పశువులను రవాణాచేసే ప్రతీ వాహనానికి తగు నిర్ధారిత ప్రామాణిక పత్రాలు పరిశీలించి అనుమతిస్తారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను అక్రమంగా రవాణాచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇతరులు ఎవ్వరూ వాహనాలను ఆపరాదని, అలాచేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, ఎస్‌ఐలు గోపాల్‌రావు, శంకర్, జయకర్, వివిధ కులాల మత పెద్దలు హఫీస్‌ఖాన్, గోలి మధుసూదన్‌రెడ్డి, హాశం, అహ్మద్ కలీం, బండారు ప్రసాద్, క్రిస్టోఫర్, శౌరయ్య, ఎలిజల నరసింహ, కౌన్సిలర్లు సమద్, బషీర్, అమీర్, అభిమన్యు శ్రీను, బాబా, ఇబ్రహీం, పాల్గొన్నారు.

శాలిగౌరారం
ప్రాజెక్టుకు జలకళ

- 17 అడుగులకు చేరిన ప్రాజెక్టు నీటి మట్టం
- నాలుగు రోజుల్లో పూర్తిగా నిండే అవకాశం 5

డిగ్రీ పరీక్షల్లో
32మంది డీబార్

5

సులభంగా సంపాదించాలనే
నకిలీ ఆయిల్ తయారీ

- ఒకసారి జైలుకెళ్లి వచ్చినా తీరు మారని నిందితుడు 4
- పట్టుకున్న సూర్యాపేట పోలీసులు

పాడి సహకార సంఘాల అనుసంధానం మంచి పరిణామం

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పాడి సహకార సంఘాలను అనుసంధానం చేయడం మంచి పరిణామమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డీసీసీబీ బ్యాంకులో డీసీవోలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025-26 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంఘంగా ప్రకటించిన సందర్భంగా జాతీయ స్థాయిలో సహకార సంస్థలను అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో సహకార సంస్థలు బలోపేతం అవుతాయన్నారు. అదేవిధంగా ప్రాథమిక పాడి సహకార సంఘాలు డీసీసీబీ బ్యాంకులో సేవింగ్ ఖాతాలు తెరవాలని కోరారు. ఈ ఖాతాలకు మైక్రో ఏటీఎం, రూపే కిసాన్ కార్డులతో పాటు అన్ని డిజిటల్ లావాదేవీల సదుపాయాలను కల్పిస్తామన్నారు. డీసీసీబీ నుంచి పీఎంఈజీపీ కింద డెయిరీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. త్వరలోనే కొత్త జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటు చేసి వారికి నాబార్డు సహాయంతో రుణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీవో పత్యానాయక్, సీఈవో శంకర్‌రావు, జీఎం నర్మద, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 2న జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్న
మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు

నల్లగొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జూన్ 2న రాష్ట్ర ఆవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలో నిర్వహించనున్న వేడుకలలో జాతీయజెండాలను మండలి చైర్మన్ గుత్తా,మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శుక్రవారం ఉత్వర్వులు జారీ చేశారు. నల్లగొండలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సూర్యాపేట జిల్లాలో నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, యాదాద్రి జిల్లాలో శాసనమండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి, వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వామపక్షాల పోరాటాల ఫలితంగా 2005లో వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం బడ్జెట్లో కేవలం రూ.73వేల కోట్లు నామమాత్రం కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఉపాధి చట్టంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని, కార్మికులకు పని దొరికి వలసలు నిలిచాయన్నారు. కానీ మోదీ కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ చట్టం లేకుండా కుట్ర చేస్తున్నారని, దాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు.

వ్యవసాయరంగంలోకి యంత్రాలు రావడంతో కూలీలకు పనిదొరకని దుస్థితి ఏర్పడిందన్నారు. సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించి జాబ్ కార్డ్ లేని పేదలందరికీ నూతన కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భార్యాభర్తలకు పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, టెంటు, మెడికల్ కిట్టు లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. నాలుగు కిలోమీటర్ల దూరం దాటితే లోకల్ ఆటో చార్జీలు చెల్లించాలని చట్టంలో ఉందని గుర్తుచేశారు. చట్టం వచ్చిన నాటి నుంచి పనిచేస్తున్న ఉపాధి సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, వేతనాలను నెలనెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యంతో పాటు పనిచేయని రోజులకు పరిహారం చెల్లిస్తూ, మరణిస్తే రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు, నాయకులు దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, చింతపల్లి మారయ్య, గండమల్ల రాములు, పెంటమల్ల సుకన్య, మన్నె భిక్షం, కట్ట అంజయ్య, రుద్రాక్షి యాదయ్య, వంగూరి వెంకన్న, మల్లయ్య, లింగయ్య, బూరుగు లక్ష్మి, ఓకుంట్ల నరసమ్మ, అశోక్, ఐతరాజు లక్ష్మయ్య, రాజు, జ్యోతి పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించడం సరికాదు

మిర్యాలగూడ టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే స్థాయి మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డిది కాదని టీడీపీ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన చేసే చంద్రబాబును విమర్శిస్తే గుర్తింపు వస్తుందని జగదీ‌ష్‌రెడ్డి భావిస్తున్నట్లు ఉందన్నారు. రాజకీయ లబ్ధి పొందాలంటే ప్రజా సేవ చేయాలని, విమర్శలు మానుకోవాలన్నారు.

సాగర్‌లో వికసించిన మే పుష్పం



నాగార్జునసాగర్, మే 30(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో మే పుష్పం ఆలస్యంగా వికసించింది. హిల్‌కాలనీకి చెందిన కసుభ సదాశివ రామకృష్ణ-సుధారాణి దంపతులు రెండేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి మే పుష్పం మొక్కను తీసుకువచ్చారు. తమ పెరట్లో నాటారు. ప్రతీ సంవత్సరం ఈ మొక్క మే మొదటి వారంలోనే వికసిస్తుందని వారు తెలిపారు. ఈ పుష్పాన్ని చుట్టుపక్కల వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

● బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివా‌స్‌గౌడ్

దేవరకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివా‌స్‌గౌడ్ అన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షి‌ప్‌లు మంజూరు చేయాలని ధర్నాకు పిలుపునిస్తే ముందస్తుగా అరెస్టు చేశారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివా‌స్‌గౌడ్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పోలీసులు శ్రీనివా‌స్‌గౌడ్‌ను ముందస్తుగా అరెస్టు చేసి పోలీ‌స్‌ స్టేష‌న్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.4500 కోట్ల స్కాలర్‌షి‌ప్‌లు, ఫీజు రీయిం బర్స్ మెంట్ విడుదల చే యాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల కోసం బీసీ సంక్షేమ సంఘం పోరాటం చేస్తుంటే పోలీసులు అ రెస్టు చేయడం సమంజసమన్నారు. ప్రభు త్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షి‌ప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సాగు పనులు షురూ



వర్షాలు కురియడంతో చందంపేట మండలంలో దుక్కులు దున్నుకుంటున్న రైతులు

- » కురుస్తున్న వర్షాలకు అన్నదాతల హర్షం
- » డివిజ‌న్‌లో దుక్కులు దున్నకం
- » విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేస్తున్న రైతులు
- » 2.25 లక్షల ఎకరాల సాగుకు ప్రణాళికలు
- » విత్తనాలు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ అధికారులు

దేవరకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానాకాలం సీజ‌న్‌కు ముందే వర్షాలు కురుస్తుండటంతో దేవరకొండ డివిజన్ పరిధిలోని రైతులు దుక్కులు దున్నుకొని విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దేవరకొండ వ్యవసాయ డివిజ‌న్‌లో 2.25 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది 2 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ఈ సంవత్సరం 1.74 లక్షల ఎకరాల్లో పత్తి, 40 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలను వేసేందుకు సిద్ధమవుతున్నారు. రైతులకు సరిపడా పత్తి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. డివిజ‌న్‌లో అత్యధికంగా రైతులు పత్తి పంటపైనే సాగుకు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి వేరుశనగ, మొక్కజొన్న, మినుములు, నువ్వులు, కుసుమలు, ఇతర వాణిజ్య పంటలు వేసుకొని అధిక దిగుబడి సాధించుకోవాలని సూచనలు, సలహాలు ఇస్తున్నారు. గత సంవత్సరం కూడా రైతులు డివిజ‌న్‌లో అత్యధికంగా పత్తి పంటను సాగు చేశారు. దీంతో పాటు మిరప, వేరుశనగ పంటలను వేశారు. ఏఎమ్మార్పీ, డిండి ప్రాజెక్టుల కింద వరి పంటను సాగు చేశారు. ఈ ఏడాది ముందస్తుగానే వర్షాలు కురుస్తుండటంతో దుక్కులు దున్నుకొని భారీ వర్షం కురిస్తే విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులకు సరిపడా పత్తి విత్తనాలు 3 లక్షల ప్యాకెట్లకు పైగా లైసెన్స్ కలిగిన దుకాణాల్లో సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నకిలీ విత్తనాలపై నిఘా

ఈ సీజ‌న్‌లో రైతులకు సరిపడా పత్తి విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. నకిలీ విత్తనాలపై నిఘా ఏర్పాటు చేశాం. రైతులు దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రశీదు తీసుకోవాలి. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని అధిక పంట దిగుబడి సాధించుకోవాలి. వరి, పత్తితో పాటు వాణిజ్య పంటలైన నువ్వులు, వేరుశనగ, మొక్కజొన్న, మిరప, ఇతర పంటలను కూడా సాగు చేసుకోవాలి.

– శ్రీలక్ష్మి, ఏడీఏ, దేవరకొండ

సిద్ధమైన పీహెచ్‌సీ, పంచాయతీ భవనం

● నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే జైవీ‌ర్‌రెడ్డి



నిడమనూరులోని పీహెచ్‌సీ నూతన భవనం

నిడమనూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలో రూ.1.56 కోట్ల నిధుల వ్యయంతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) భవనంతో పాటు మండలంలోని పార్వతీపురం గ్రామంలో రూ.20లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ఎట్టకేలకు ప్రారంభోత్సవాలకు సిద్ధమయ్యాయి. మండల కేంద్రంలో మూడేళ్లుగా నత్తనడకన సాగిన పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం పనులు దాదాపుగా పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీ‌ర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ శనివారం ఈ భవనాన్ని ప్రారంభించనున్నారు. నిడమనూరులో రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.1.56 కోట్ల నిధులు మంజూరు చేసింది. నూతన భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడంతో శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనే ప్రమాదమని తెలిసినా సిబ్బంది అందులోనే విధులు నిర్వహించారు. కలెక్టర్, డీఎంహెచ్‌వోలు తరచూ నూతన భవనాన్ని సందర్శించి నిర్మాణ పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసి అప్పగించాని ఆదేశించినా నిర్మాణానికి మూడేళ్లు పట్టింది. ఇటీవలే విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించి భవనం శిథిలమైంది. సామగ్రి కాలిపోయినా అదృష్టం బాగుండటంతో ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పాత భవనం దగ్ధం కావడం, కొత్త భవనం నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఓపీ సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే కుందూరు జైవీ‌ర్‌రెడ్డి పీహెచ్‌సీ భవనాన్ని సందర్శించి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో నిర్మాణ పనులు ముమ్మరం చేసి పూర్తి చేశారు. నూతన పీహెచ్‌సీ భవనాన్ని అన్ని హంగులు, ఆధునిక సౌకర్యాలతో నిర్మించారు. వైద్యులకు ప్రత్యేకమైన గదులు, ఓపీ హాలు, ల్యాబ్, స్టోర్ రూము తదితర సదుపాయాలతో భవనాన్ని విశాలంగా నిర్మించారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. మండలంలోని పార్వతీపురంలో రూ.20 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని కూడా నేడు ఎమ్మెల్యే జైవీ‌ర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేయనున్నారు. కాగా పంచాయతీ భవనాన్ని ఏడాదిన్నర క్రితమే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రొటోకాల్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఘర్షణ పడటంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు స్థానిక ఎన్నికలలో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం గా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రభు త్వం విద్య, వైద్యం, ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిస్తుందని అన్నారు. శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తయితే దేవరకొండ నియోజకవర్గం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు. అనంతరం కొండభీమనపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మునుకుంట్ల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ మునుకుంట్ల విద్యావతి, అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రె‌స్‌లో చేరుతున్నారని అన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధ‌ర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, జూలూరి ధనలక్ష్మి, ఆలంపల్లి నర్సింహ, నాయకులు మారేపాకల సురే‌ష్‌గౌడ్, శిరందాసు కృష్ణయ్య, వడ్త్య దేవేంద‌ర్‌నాయక్, జా‌న్‌యాదవ్, కొర్ర రాంసింగ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రె‌స్‌లో చేరుతున్న మునుకుంట్ల విద్యావతి వెంక‌ట్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

‘భూభారతి’పై అవగాహన కల్పించాలి

● ఎమ్మెల్యే కుందూరు జైవీ‌ర్‌రెడ్డి



మంత్రికి వివరిస్తున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీ‌ర్‌రెడ్డి

హాలియా, మే 30 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కుందూరు జైవీ‌ర్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వ‌ర్‌రావు, కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. సూర్యాపేటలో జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అవగాహన సదస్సులో పాల్గొని అనంతరం ఇందిరమ్మ ఇళ్లపై అర్హులైన వారికి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన పేదవారికి కేటాయించాలని కోరారు. నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వచ్చాయి కనుక రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు వీలునైంత త్వరగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంపై రైతులు, మిల్లర్లు, అధికారులకు మరింత అవగాహన కల్పించాలని కోరుతూ వారికి దృష్టికి తీసుకువచ్చారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి

జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సుదర్శ‌న్‌రెడ్డి



బొల్లిగుట్టతండాలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు

దామరచర్ల, మే 30(ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలను విడనాడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కోల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శ‌న్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొల్లిగుట్టతండా గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనులు చేసే కూలీల వద్దకు వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందని అలాంటి కాలంలో ఇంకా మూఢ నమ్మకాలను నమ్మవద్దని అన్నారు. మనిషి మనుగగడకు ఆహారపు అలవాట్లు ప్రధాన కారణమని, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ఆయు ప్రమాణాన్ని పెంచుకునే అవకాశం ఉందన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని నవజ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పక్షవాతం, మూర్ఛ, బీపీ, షుగర్ వ్యాధి ఉన్న నిరుపేదలకు ప్రముఖ నరాల వైద్యుడు గోపాలం శివన్నారయణతో జూన్ 15వ తేదీన పరీక్షించి రోగి నుంచి నెలకు రూ.75, నాలుగు నెలలకు కలిపి మూడు నెలల నామమాత్రపు రుసుముతో నాలుగు నెలలకు సరిపడా మందులను అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు పారేపల్లి సత్యనారాయణరావు, పాదూరి రమణారెడ్డి, గణేష్, బైరం శేఖర్, పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్, లాలు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ప్రోత్సాహానికి కృషి : బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో బీఎల్ఆర్ బ్రదర్స్, ఎన్వీఆర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడోత్సవం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరైన ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అభినందించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా ఆటలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఆటలతో మానసిక, శారీరక ధృడత్వం లభిస్తుందని, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. తద్వారా చదువులో రాణించగలరన్నారు. కార్యక్రమంలో ఎన్వీఆర్ సంస్థ చైర్మన్ నూకల వేణుగోపా‌ల్‌రెడ్డి, కరాటే మాస్టర్ బూడిద సైదులు, ఆడోతు అశోక్, కొమ్ము శ్రీను, రుణా‌ల్‌రెడ్డి, రామకృష్ణ, చారి, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే బీఎల్ఆర్ తదితరులు

మునిసిపాలిటీకి మినీ ట్రక్కులు



కార్యాలయానికి వచ్చిన మినీ ట్రక్కులు

మిర్యాలగూడ టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు మెరుగుపరిచేందుకు అధికారులు మునిసిపాలిటీకి 12 మినీ ట్రక్కులు తెప్పించారు. ఏ నిధులతో ట్రక్కులు కొనుగోలు చేశారన్న విషయాన్ని మునిసిపల్ కమిషనర్ వెల్లడించలేదు. రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా జూన్ 2న ప్రారంభమయ్యే వంద రోజుల కార్యాచరణ సందర్భంగా ఆయా వాహనాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిసింది.

నిరాశను మిగిల్చిన మద్దతు ధరలు



అనిల్‌కుమార్

హాలియా, మే 30(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం 14 పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధరలు తెలంగాణ రైతులను తీవ్ర నిరాశకు గురిచేశాయని ఏకే ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా పంటలకు ఎక్కువ మొత్తంలో మద్దతు ధరలు వస్తాయని ఆశపడినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకి అండగా జాతీయ వ్యవసాయ ఖర్చుల, ధరల కమిష‌న్‌కి సిఫారసు చేసిన కనీస మద్దతు ధరలను ప్రకటించ లేదన్నారు. అన్ని పంటలపైన నామమాత్రపు ధరలను ప్రకటించి మరోసారి వ్యవసాయ రంగంపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న తన వైఖరి విధానాన్ని చాటి చెప్పి వ్యవసాయ రంగం, వాటి అనుబంధ రంగాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ ఖర్చులు చాలా పెరిగాయని పేర్కొన్నారు.

లబ్ధిదారులకు సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి



వేములపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో రేష‌న్‌ను పంపిణీ చేయాలని తహసీల్దార్ హేమలత సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఒకేసారి మూడు నెలలకు సరిపడా రేష‌న్‌బియ్యం పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. డీలర్లు దుకాణాల్లో అందుబాటులో ఉంటూ ప్రతి లబ్ధిదారునికి బియ్యాన్ని అందించాలన్నారు. రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసే ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీటీ కోటేశ్వరి, ఆర్ఐలు మహేంద‌ర్‌రెడ్డి, స్పందన, డీలర్లు సుధాక‌ర్‌రెడ్డి, పాండురంగయ్య, కృష్ణమూర్తి, నాగేశ్వ‌ర్‌రావు, గురవయ్య, సతీ‌ష్‌రెడ్డి, లచ్చయ్య, రవి, సంతోష్ పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలి



శెట్టిపాలెంలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో కిశో‌ర్‌నాయక్, ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు

వేములపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్ యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరంగా కేసులను నమోదు చేస్తామని ఏవో కిశో‌ర్‌నాయక్ అన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎరువుల దుకాణ య జమానులు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. రైతులు సైతం తమ సాగుకు అవసరమైన విత్తనాలను అధీకృత డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసేటప్పుడు రశీదులను తప్పకుండా పొందాలన్నారు. అట్టి రశీదుతోపాటు విత్తన ప్యాకెట్లను సీజన్ ముగిసేంతవరకు భద్రపరుచుకోవాలని, విత్తనాల విషయంలో ఏమైనా నష్టం ఏర్పడితే అట్టి రశీదు, విత్తనాల ప్యాకెట్ల ద్వారా సంబంధిత విక్రయదారునిపై చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అమ్మినట్లయితే ఆ డీలర్లు, షాపు యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీధ‌ర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్ష పదవిని

ఎస్సీ మాదిగలకు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సంఘాల నాయకులు

దామరచర్ల, మే 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవిని ఎస్సీ మాదిగలకు కేటాయించాలని పలువురు మాదిగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. జనరల్ స్థానంలో రెడ్డిలు, ఆ తర్వాత బీసీలు మండల అధ్యక్ష పదవిని చేపట్టారని కానీ ఇప్పటివరకు ఎస్సీ మాదిగలకు మండల అధ్యక్ష పదవి కేటాయించలేదన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మాదిగలు ఎంతో కృషి చేశారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఎస్సీ మాదిగకు కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు కొమ్ము దాసు, ఆకారపు గోపాల్, సందాల సదానందం, అల్లంపల్లి నాగేశ్వ‌ర్‌రావు, నగేష్, వసంతకుమార్, రాజేష్, సందాల శంభయ్య, కోట ఈశ్వర్, పోకల రవికుమార్, కొమ్ము రాజేష్, కాశయ్య, శ్రీను పాల్గొన్నారు.

సినిమా గైడ్

మిర్యాలగూడ

శ్రీనివాస	: భైరవం
వెంకటేశ్వర	: ఖలేజా ఏస్
రాఘవ	: ఖలేజా, కరాటే కిడ్స్ లెజెండ్స్
విట్రోస్	: ఖలేజా, భైరవం

దేవరకొండ

మైత్రి వెంకటేశ్వర	: కరాటే కిడ్స్ లెజెండ్స్